క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో శ్రీచక్రయంత్ర ప్రతిష్ఠ



హోమం నిర్వహిస్తున్న భక్తులు

జూపాడుబంగ్లా: నందికొట్కూరు పట్టణంలో వెలసిన శ్రీచౌడేశ్వరీదేవి ఆలయంలో గురువారం శ్రీచక్రయంత్ర ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.కొప్పుల నారాయణ, శేషమ్మ దంపతులు, సత్యనారాయణ, అలివేలమ్మ దంపతులు, రాజశేఖర్, లక్ష్మి దంపతుల సహకారంతో ఆలయంలో శ్రీచక్రం, కుబేర యంత్రం,8 బలిపీఠాలను ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు వేదమంత్రాల మధ్య హోమం నిర్వహించి, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి బలిహారతులు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు రవీంద్రబాబు, వసంతకుమారి, దేశెట్టి శ్రీనివాసులు, పాణ్యం వేణుగోపాల్, పూజారిబాబు, కృష్ణ,రామచంద్రుడు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్లకు షోకాజ్ నోటీసులు

పగిద్యాల: మండలంలోని నెహ్రూనగర్ సచివాలయం–1 పరిధిలో గురువారం చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమానికి గైర్హాజరైన 19 మంది వలంటీర్లకు ఎంపీడీఓ వెంకటరమణ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఎందుకు గైర్హాజరయ్యారో వివరణ ఇవ్వాలని వెంటనే అత్యవసర సమావేశం నిర్వహించి అందరికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ ఘటనపై జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి ఎంపీడీఓను నివేదిక ఇవ్వాల్సిందిగా కోరినట్లు సమాచారం.

పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు

మిడుతూరు: పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకోవాలని ఈఓఆర్డీ ఫకృద్దీన్ సూచించారు.మండల పరిధిలోని చింతలపల్లి, దేవనూరు గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. ఈఓఆర్డీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో ఇంటి పన్నులు, కుళాయి పన్ను వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. గ్రామాల్లో ఉన్న ట్యాంకులను శుభ్రపరచి క్లోరినేషన్ చేయాలని చెప్పారు. చింతలపల్లి గ్రామంలో ఘనవ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రం తనిఖీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వీరారెడ్డి, వినయ్ చంద్ర, గ్రామ సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

లక్ష్యాలను అధిగమించాలి

మిడుతూరు: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని ఎంపీడీఓ జీఎన్ఎస్‌రెడ్డి సూచించారు. గురువారం మండలపరిధిలోని నాగలూటి జగనన్న లే అవుట్‌ను పరిశీలించారు. అనంతరం సచివాలయ సిబ్బందితో ఇంటి నిర్మాణాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న లే అవుట్లలో ఇంటి నిర్మాణాలను వేగవంతం చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉగాది నాటికి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలు అధిగమించని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ రమేష్, పంచాయతీ కార్యదర్శి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మత్తు జోలికి వెళ్తే జీవితం చిత్తే



విద్యార్థులకు వివరిస్తున్న ఎస్‌ఐ అశోక్

పాములపాడు: మత్తుకు బానసైతే జీవితం చిత్తైనట్లేనని ఎస్‌ఐ అశోక్ అన్నారు. గురువారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వాడకం వలన కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ కళాశాలల్లోనే జీవితాలు మలుపు తిరుగుతాయన్నారు. విద్యాబుద్ధులు నేర్చుకుంటూ క్రమశిక్షణగా నడుచుకుంటే జీవితాన్ని బంగారు మయం చేసుకోవచ్చన్నారు. అలాగే రహదారులపై వెళ్లేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది రామేశ్వరరావు, ఖాజీ, రసూల్, కర్ణ తదితరులున్నారు.

కుష్టువ్యాధిపై అవగాహన



విద్యార్థులకు స్పర్శ గురించి అవగాహన కల్పిస్తున్న డీపీఓ నారాయణరావు

పాములపాడు: కొత్తపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో డీపీఓ నారాయణరావు విద్యార్థులకు కుష్టువ్యాధిపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాధి ప్రారంభ దశలో గుర్తించినట్లైతే పూర్తిగా నయం చేయవచ్చన్నారు. శరీరంపై స్పర్శలేని మచ్చలు, పొడవున్న శరీరంపై మెరిసినట్లు ఉన్న కణతలు వ్యాధి లక్షణాలన్నారు. ఈనెల 13 వరకు కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

దేశానికే ఆదర్శం సీఎం వైఎస్ జగన్

- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి
- మోతుకూరు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'
- ఆర్‌బీకే, గ్రామ సచివాలయం ప్రారంభం



రూ.5 వేల పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

వెలుగోడు: దేశంలోనే ఎక్కడా లేని అద్భుతమైన పథకాలను ఆంధ్రప్రదేశ్‌లో ప్రవేశపెట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కొనియాడారు. ఆయన ముఖ్యమంత్రిగా ఉండటం రాష్ట్ర ప్రజల అదృష్టమన్నారు. ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం మోతుకూరు గ్రామంలో కొనసాగింది. వైఎస్సార్‌సీపీ సచివాలయ కన్వీనర్ ఎం.సుధాకర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోగోలు శివశంకర్ నాయుడు ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను గజమాలతో సత్కరించారు. అనంతరం సచివాలయం వరకు రూ.10 లక్షల నిధులతో నిర్మించిన సీసీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి ఈ మూడున్నరేళ్ల పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరించి, వారి ఆశీస్సులు ప్రభుత్వానికి ఉండాలని కోరారు.

సమస్యలకు అక్కడిక్కడే పరిష్కారం

ఓ మహిళ తన భర్త మరణ ధ్రువీకరణ పత్రం మూడేళ్లుగా ఇవ్వలేదని ఫిర్యాదు చేయగా.. స్పందించిన ఎమ్మెల్యే అధికారులతో మాట్లాడి నాన్ అవైలబులిటీ ధ్రువీకరణ పత్రాన్ని అక్కడిక్కడే ఇప్పించారు. అలాగే మాబు అనే వ్యక్తి కాలుకు సెప్టిక్ అయి నడవలేని స్థితిలో ఉండగా ఎమ్మెల్యే శిల్పా ఆర్థికసాయం అందించారు. మోతుకూరు గ్రామంలో మసీదు, శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపడంపై ముస్లింలు ఎమ్మెల్యేను సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

ఎమ్మెల్యే చొరవతో పింఛన్ల పెంపు

వెలుగోడు పట్టణానికి చెందిన 10 మంది పింఛన్ లబ్ధిదారులు మంచానికే పరిమితమై, ఆర్థికంగా, అనారోగ్యంతో బాధపడుతుండటం గమనించిన ఎమ్మెల్యే..వారి పింఛన్ పెంచేలా అధికారులను ఆదేశించారు. డాక్టర్ల సిఫార్స్‌తో వారి పింఛన్ రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పెంచారు. కొత్తగా మంజూరైన పింఛన్ సొమ్మును ఎమ్మెల్యే శిల్పా గురువారం లబ్ధిదారులకు అందించారు.

ఆర్‌బీకే, గ్రామ సచివాలయం ప్రారంభం

మోతుకూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం, గ్రామ సచివాలయ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఎమ్మెల్యే శిల్పాకు స్థానిక నాయకులు ఎం.నాగేశ్వరరెడ్డి, ఎం.రామసుబ్బారెడ్డి, ఎంపీటీసీ ఎం.ఈశ్వరమ్మ, బోగోలు సుదర్శనం ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా భువనేశ్వర్ రెడ్డి, ఏపీసీపీడీసీఎల్ రీజినల్ కో–ఆర్డినేటర్ డాక్టర్ శశికళారెడ్డి, మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి, ఎంపీపీ లాలం రమేష్, సర్పంచ్ వేల్పుల జయపాల్, వైఎస్సార్‌సీపీ నాయకులు దేశం తిరుపంరెడ్డి, బోగోలు బాలసుబ్బయ్య, వై.సుధాకర్‌రెడ్డి, హరినాథరెడ్డి, నాగార్జున నాయుడు, రామలింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

ఆత్మకూరు: ఆత్మకూరు పట్టణం, మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం జరిగే పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి పాల్గొంటారని పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు అంజాద్ అలీ తెలిపారు. పట్టణంలోని మక్కా మసీదు సర్కిల్‌లో నూతన సీసీ రోడ్డు పనులకు భూమి పూజ, కృష్ణాపురం గ్రామంలో గ్రామ నూతన సచివాలయాన్ని ప్రారంభిస్తారన్నారు. అనంతరం ఆ గ్రామంలో గడప గడప కు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమాలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బీమా సాయం అందజేత

మిడుతూరు: చౌట్కూరు గ్రామానికి చెందిన స్వాములు అనారోగ్యంతో బుధవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి రవీంద్రబాబు గ్రామ సర్పంచ్ మదార్ సాహెబ్ చేతుల మీదుగా వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద రూ.10 వేలు నామినీ అయిన గాయత్రికి అందజేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అసిస్టెంట్ స్వామన్న యాదవ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ డ్రైవర్లకు సన్మానం



అవార్డు గ్రహీతలను సన్మానిస్తున్న ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు

ఆత్మకూరు: రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా అవార్డు పొందిన డిపోకు చెందిన డ్రైవర్లను స్థానిక ఏపీఎస్ ఆర్టీసీ డిపో ఆవరణలో గురువారం డిపో మేనేజర్ మహేంద్రుడు సన్మానించారు. ఆయన మాట్లాడుతూ విధి నిర్వహణలో అంకిత భావంతోపనిచేస్తూ ఎలాంటి ప్రమాదాలు జరగకుండా సురక్షితంగా వాహనాలు నడిపి ఉత్తమ డ్రైవర్లుగా అవార్డు పొందడం పట్ల సంతోషంగా ఉందన్నారు. అవార్డు గ్రహీతలు ఈఆర్‌సీ గౌడు, గఫార్, రహమతుల్లా, ఖజరేషలను దుశ్శాలువా, పూలమాలలతో సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎంయూ నాయకులు షఫివుల్లా, సిబ్బంది పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం

జూపాడుబంగ్లా/పాములపాడు/ఆత్మకూరు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రాష్ట్రానికి అన్యాయం చేశారంటూ గురువారం సీపీఎం, సీపీఐ, ఏపీ రైతుసంఘం నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. నందికొట్కూరు పటేల్ సెంటర్‌లో, పాములపాడు బస్టాండ్ సెంటర్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. జూపాడుబంగ్లాలో కేజీరోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. నాయకులు నాగేశ్వరరావు, రఘురామ్మూర్తి, వెంకటేశ్వర్లు, స్వామన్న, రమణ పాల్గొన్నారు. ఆత్మకూరు పట్టణంలోని కొత్తబస్టాండ్‌లో సీపీఎం పట్టణ కార్యదర్శి రణధీర్, మండల కార్యదర్శి నరసింహానాయక్‌ల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు.

'బీజేపీ ప్రభుత్వం మాట తప్పింది'

పాములపాడు: బీజేపీ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణపై ఇచ్చిన మాట తప్పిందని ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి నాగరాజు అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన 100 రోజుల్లోనే హామీని నెరవేరుస్తామని చెప్పిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వం ఏర్పడి 8 సంవత్సరాలు కావస్తున్న వర్గీకరణ విషయం పార్లమెంటులో బిల్లు పెట్టకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఈ నెల 13వ తేదీన హైదరాబాదు–విజయవాడ జాతీయ రహదారి నిర్బంధానికి అగ్ర నాయకత్వం పిలుపునిచ్చిందని తెలిపారు. మాదిగలంతా ఏకమై రావాలని కోరారు. సనమావేశంలో ఆ సంఘం మండల గౌరవాధ్యక్షుడు రత్నమయ్య, ఎంఎస్పీ కన్వీనర్ కనకం నాగరాజు, కో కన్వీనర్ శేఖర్ పాల్గొన్నారు.

'నాడు-నేడు' పనుల్లో నాణ్యత లోపించరాదు

పగిద్యాల: రెండో విడుత నాడు– నేడు పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో చేపట్టిన పనుల్లో నాణ్యత లోపించరాదని ఎంఈఓ సుభాన్ ఆదేశించారు. గురువారం మండల పరిధిలోని పీకే ప్రాగటూరు, తూర్పు, పడమర నెహ్రూనగర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పనుల పురోభివృద్ధిపై ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాడు నేడు పనులను వేగవంతం చేసి నిర్ణీత కాల వ్యవధిలో పూర్తి చేయించాలని హెచ్ఎంలకు సూచించారు. అలాగే విద్యార్థులకు నాణ్యమైన విద్యా బోధనను అందించాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు ఉన్నారు.

త్వరలో శనగ కొనుగోలు కేంద్రాలు

జూపాడుబంగ్లా: రైతు భరోసా కేంద్రాల పరిధిలో త్వరలో శనగల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు జూపాడుబంగ్లా ఏఓ కృష్ణారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మండలంలోని మండ్లెం గ్రామంలో మినుము పంటలో పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన రైతులతో మాట్లాడుతూ రైతులు నేలస్వభావం, వాతావరణ పరిస్థితులను అనుసరించి నాణ్యమైన విత్తనాలను ఎంపిక చేసుకోవాలని సూచించారు. అనంతరం ఈకేవైసీ కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది బాలీశ్వర్, వినోద్, శ్రవంతి, రైతులు పాల్గొన్నారు.

బోర్డులు ఏర్పాటు చేయకుండానే నిధులు స్వాహా



మాట్లాడుతున్న డీఆర్పీ మధుసూదన్

జూపాడుబంగ్లా: ఉపాధి హామీ పనుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయకుండా రూ.14,150 స్వాహా చేసినట్లు గ్రామసభలో డీఆర్పీ మధుసూదన్ వెల్లడించారు. గురువారం మండలంలోని తాటిపాడు గ్రామసచివాలయం వద్ద సర్పంచ్ వంగల లక్ష్మీదేవమ్మ అధ్వర్యంలో ఎంపీడీఓ మంజులవాణి, ఏపీఓ గౌరీబాయి, ప్రత్యేకాధికారి, ఎంఈఓ మోహన్ సమక్షంలో గ్రామసభను నిర్వహించారు. డీఆర్పీ మాట్లాడుతూ 2021 ఏప్రిల్ 1 నుంచి 2022 మార్చి 31 వరకు జరిగిన ఉపాధిహామీ కింద రూ.33,22,946లు వెచ్చించి 23 పనులు చేసినట్లు తెలిపారు. అందులో ఆశ వర్కర్లు, వీబీకేలు, వీఆర్ఏలు మధ్యాహ్నభోజన నిర్వాహకులు పాల్గొన్నట్లు వెల్లడించారు. అలాగే రోజ్‌వారి దివాస్ రిజిష్టర్ నిర్వహించలేదని తెలిపారు. శుక్రవారం జరిగే మండలస్థాయి బహిరంగ సభలో ఈ విషయాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నట్లు ఎంపీడీఓ తెలిపారు.

ఏటా భూసార పరీక్షలు చేయించుకోవాలి



కియోస్క్‌లో ఎరువులు, విత్తనాల నమోదు ప్రక్రియను రైతుకు వివరిస్తున్న ఏఓ శ్రావణి

జూపాడుబంగ్లా: రైతులు ప్రతి ఏటా తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని నందికొట్కూరు ఏఓ శ్రావణి సూచించారు. గురువారం ఆమె మండలంలోని నాగటూరు రైతుభరోసా కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామంలో రైతులు సాగుచేసిన మినుము, పెసర, మొక్కజొన్న, వేరుశనగ పంటలను పరిశీలించారు. రైతులకు రసాయన ఎరువుల వాడకం వల్ల కలిగే నష్టాలు, పంట మార్పిడి విధానం, భూసార పరీక్షలు తదితర వాటిపై అవగాహన కల్పించారు. రబీ సీజన్‌లో సాగుచేసిన పంటలకు ఈనెల 15లోగా ఈక్రాప్ బుకింగ్ చేయించుకోవాలని సూచించారు.

మతసామరస్యానికి ప్రతీక తిక్కస్వామి ఉరుసు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సాయిబాబానగర్‌లో వెలసిన శ్రీహజరత్ సయ్యద్‌షా షహన్‌షా అవులియా చిస్తివుల్ ఖాదరి ఖుద్దహు (తిక్కస్వామి) ఉరుసు ఈనెల 2 నుంచి 6వ తేదీ వరకు 5రోజుల పాటు జరుగుతాయని దర్గా ధర్మకర్త చాంద్‌బాషా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పట్టణంలో ఏటా పల్లె వాతావరణాన్ని తలపిస్తూ సాయిబాబానగర ప్రాంతంలో ఉత్సవాలకు పట్టణ పరిసర గ్రామీణ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారన్నారు. షెహన్‌షా వలి.. తిక్కస్వామిగా అవతరించి 1945లో మరణించిన స్థలం వద్దనే ఈ దర్గాను నిర్మించారన్నారు. స్వామి వారు ఎన్నో మహిమలు చూపారని స్థానికులు పేర్కొంటారు. ఈనెల 2వ తేదీన గంధం వేడుకలు, 3న ఉరుసు, 4, 5, 6 తేదీల్లో జార్తలు నిర్వహిస్తామన్నారు. వేడుకల్లో భాగంగా స్వామి వారికి ఫాతెహాలు, పూలదండల సమర్పణ, గంధ సమర్పణ, అన్నదాన కార్యక్రమం తదితర కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఫకీర్లు స్వామి వారి మహత్యాన్ని పాటల రూపంలో వినిపిస్తారని, 3న రాత్రి ఖవ్వాలి పోటీలు ఏర్పాటు చేశామని వివరించారు.

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు



తూడిచెర్ల సచివాలయంలో ఉద్యోగులకు సూచిస్తున్న ఆర్డీఓ ఎం దాసు

జూపాడుబంగ్లా: సచివాలయ ఉద్యోగులు ఇష్టారాజ్యంగా విధులు నిర్వర్తిస్తే చర్యలు తప్పవని ఆత్మకూరు ఆర్డీఓ ఎం దాసు హెచ్చరించారు. గురువారం ఆయన తూడిచెర్ల గ్రామ సచివాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎలక్ట్రికల్ అసిస్టెంటు హాజరుపట్టికలో సంతకం చేసి మూవ్‌మెంటు రిజిష్టర్‌లో ఎక్కడికి వెళ్లింది రాయకుండా వెళ్లటంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో కుళాయి, నీటి పన్నుల వసూళ్లకు సంబంధించి తప్పనిసరిగా రిజిష్టర్ నిర్వహించాలని కార్యదర్శికి సూచించారు. సచివాలయ ఉద్యోగులందరూ సకాలంలో విధులకు హాజరై ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమగ్రభూ సర్వే కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని, కార్యక్రమం నత్తనడకన సాగుతుండటంపై వీఆర్వో, గ్రామసర్వేయర్లపై మండిపడ్డారు. కార్యక్రమంలో సర్పంచ్ బాలమద్దిలేటి, తహసీల్దార్ పుల్లయ్యయాదవ్, ఆర్ఐ శ్రీరంగారెడ్డి, వీఆర్వో మనోహర్, ఆర్డీఓ సీసీ జగదీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలు శ్రీశైలంలోనే ఇవ్వండి



అభిప్రాయ సేకరణ చేపడుతున్న అధికారులు

శ్రీశైలం: శ్రీశైలంలోనే ఇంటి స్థలాలు ఇవ్వాలని స్థానిక కొత్తపేట, ఎస్సీ, ఎస్టీ బీసీ, వడ్డెర కాలనీ, పాతాళగంగ వాసులు అధికారులను కోరారు. క్షేత్రపరిధిలోని మల్లికార్జున కల్యాణ మండపంలో గురువారం సాయంత్రం కొత్తపేట, ఎస్సీ, ఎస్టీ బీసీ, వడ్డెర కాలనీ, పాతాళగంగ మత్స్యకారులు తదితర వారందరితో హౌసింగ్, రెవెన్యూ అ ధికారులు సమావేశం నిర్వహించారు. జగనన్న కాలనీ కాలనీల నిర్మాణం కోసం తమ అభిప్రాయాలను తెలియజేయాలని కోరారు. కాగా, 40 ఏళ్లుగా శ్రీశైలంలోనే ఉంటూ ఏదో రకంగా జీవనోపాధి పొందుతున్నామని, ఇక్కడే స్థలాలు కేటాయిస్తే ఇళ్లు నిర్మించుకుంటామని స్థానికులు తమ అభిప్రాయన్ని వెల్లడించారు. సున్నిపెంటలో స్థలాలు కేటాయించి ఇళ్లనిర్మాణం కోసం రూ.లక్షా 80 వేల వరకు రుణసదుపాయం కూడా కల్పిస్తామని అధికారులు చెబుతున్నారని, కానీ అదే రుణసదుపాయాన్ని కల్పిస్తూ శ్రీశైలంలోనే స్థలాలు ఇవ్వాలని విన్నవించారు. కార్యక్రమంలో హౌసింగ్ బోర్డు డీఈ, ఇన్‌చార్జ్ ఈఈ ఉమామహేశ్వరరావు, ఆర్ఐ రవి, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్లు లక్ష్మీ, గ్రేస్, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షులు ఎంఏ రజాక్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వ్యవస్థలపై అవగాహనలేకనే ఆరోపణలు



చిలకపాటి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

శ్రీశైలం ప్రాజెక్ట్: రాష్ట్ర ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేసిందని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఆరోపణలు చేయడం వ్యవస్థలపై ఆయనకు అవగాహన లేని విషయాన్ని తెలియజేస్తోందని రాష్ట్ర పురపాలక, పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. గురువారం ఆయన శ్రీశైలం ప్రాజెక్ట్‌లోని ఏపీ జెన్‌కో గెస్ట్‌హౌస్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆడియో సంభాషణకు, శ్రీధర్‌రెడ్డి ఆరోపణలకు పొంతన లేదన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరు ఏ రాజకీయ పార్టీలోనైనా ఉండొచ్చని, అంతేకానీ మనసులో ఒకటి పెట్టుకొని బయటకు ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. నారాలోకేష్ యువగళం పాదయాత్రపై విలేకరులు ప్రశ్నించగా అది ప్రజాదరణలేని యాత్రగా కొట్టిపారేశారన్నారు.

చిలకపాటి కుటుంబానికి మంత్రి పరామర్శ

శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీ డ్యామ్ డివిజన్ ఇంజినీర్ చిలకపాటి చిట్టిబాబు, శామ్యూల్ జాడ్జ్ విద్యాసంస్థల నిర్వాహకులు చిలకపాటి రాజబాబు మాతృమూర్తి నాగరత్నమ్మ అనారోగ్య కారణాలతో గత నెల 28న మృతి చెందారు. గురువారం శ్రీశైలంప్రాజెక్ట్ కాలనీలోని లూథరన్ చర్చ్ ప్రాంగణలో ఆమె జ్ఞాపకార్థం ఏర్పాటు చేసిన ఆదరణ స్తుతి కూడికకు రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ హాజరయ్యారు. నాగరత్నమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించారు. చర్చి ప్రాంగణంలో జరిగిన స్తుతి కూడికలో మంత్రి తన సందేశాన్ని అందించారు.

అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలి



ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, భువనేశ్వర్‌రెడ్డిలను సన్మానిస్తున్న దృశ్యం

మహానంది: రాష్ట్రంలో అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఆకాంక్షించారు. గురువారం గాజులపల్లె ఆర్ఎస్ గ్రామంలోని శ్రీ గంగా, గౌరీ సమేత మరకత లింగేశ్వరస్వామి, నవగ్రహాల దేవాలయాల్లో జరిగిన ధ్వజ ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్‌రావు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. పూజల అనంతరం వారిని సత్కరించారు. మహానంది ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వర్‌రెడ్డి, గోపవరం సర్పంచ్ వంకె సుదర్శనం, గాజులపల్లె ఆర్ఎస్ నేతలు కందుల శ్రీనివాసులు, బాలయ్యగౌడు, అశోక్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేబుల్ పనులను అడ్డుకున్న గ్రామస్తులు

బండిఆత్మకూరు: జియో ఫైబర్ కేబుల్ పనులను గురువారం బండిఆత్మకూరు గ్రామస్తులు అడ్డుకున్నారు. బండిఆత్మకూరులోని కుందూనది మీద ఉన్న వంతెనపై కేబుల్ పనులను చేపట్టారు. ఇక్కడ కేబుల్ పైపును కింద ఉంచి పైన సిమెంటు దిమ్మెను ఏర్పాటు చేస్తున్నారు. దీంతో విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, ఉప సర్పంచి అవుటాల నాగేశ్వరరెడ్డి, మదీన చికెన్ సెంటరు నిర్వాహకులు ఇస్మాయిల్ తదితరులు అక్కడికి చేరుకుని పనులు చేస్తున్న వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. దిమ్మె ఏర్పాటు చేయడం వల్ల వరదల సమయంలో నీరు గ్రామంలోకి వచ్చే అవకాశం ఉందన్నారు. ఈఓఆర్డీ శ్రీనివాసులు, కార్యదర్శి నటరాజు అక్కడికి చేరుకొని అనుమతులు లేవని నిర్ధారించుకొని పనులను నిలిపి వేశారు.


కార్మికులను తొలగించడం సరికాదు

ఆత్మకూరు: కర్నూలు – నంద్యాల జిల్లాల్లో విజయ పాల డెయిరీలో పని చేస్తున్న కార్మికులను తొలగించడం సరికాదని సీఐటీయూ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు రజాక్, రామ్‌నాయక్ అన్నారు. గురువారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎలాంటి నోటీసులు ఇవ్వకుండ కార్మికులను విధుల నుంచి తొలగించారన్నారు. వీరిని సత్వరమే విధుల్లోకి తీసుకోవాలని కోరారు. సీఐటీయూ నాయకులు ఏసురత్నం, సురేంద్ర, రణధీర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఆసుపత్రిలో సౌకర్యాలు కల్పించండి

ఆత్మకూరు: శ్రీశైలంప్రాజెక్ట్ ఆసుపత్రిలో రోగులకు సరైన వైద్య సౌకర్యాలు అందడం లేదని భారతీయ జనతాపార్టీ నాయకులు ఎస్‌వీఎస్ మల్లికార్జున, గెల్లి వెంకటేశ్వర్లు, వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ అనురాధ దృష్టికి తీసుకువచ్చారు. డాక్టర్ అనురాధ గురువారం సున్నిపెంట ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. ఆసుపత్రిలో వర్గ పోరు వలన రోగులకు సరైన వైద్యం అందడం లేదని, ఎక్స్‌రే ప్లాంట్‌లో మదర్‌బోర్డును దొంగిలించారని, షుగర్ టెస్ట్‌లు అసలు చేయడం లేదని, మందుల కొరత కూడా ఉందని ఆమె దృష్టికి తీసుకువచ్చారు. డాక్టర్లు శ్రీనివాసులు, రజని, సోమశేఖరప్ప పాల్గొన్నారు.

కాకనూరులో అన్నదానం



భోజనాలు వడ్డిస్తున్న శివయోగేంద్ర సరస్వతి

బండిఆత్మకూరు: కాకనూరు గ్రామంలోని నారాయణ స్వామి ఆశ్రమంలో గురువారం భీష్మ ద్వాదశి వేడుకలు నిర్వహించారు. ఆశ్రమంలో భీష్ముని గొప్పదనం గురించి ఆశ్రమ నిర్వాహకులు శివయోగేంద్ర సరస్వతి వివరించారు. తర్వాత భజనలు, సంకీర్తనలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దారు ఉమారాణి, డిప్యూటీ తహసీల్దారు హరిత పాల్గొన్నారు.

శభాష్ వలంటీర్లు



మద్దూరు గ్రామానికి చెందిన రామిరెడ్డికి నంద్యాలలో పింఛన్ అందజేస్తున్న వలంటీర్లు



కర్నూలులో రోళ్లపాడుకు చెందిన కురువ రాముడికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ ప్రకాశ్‌రెడ్డి



రాజంపేటలో రత్నమ్మతో థంబ్ తీసుకుంటున్న వలంటీర్ అనిత

పాములపాడు:లబ్ధిదారులు ఎక్కడున్నా వారి వద్దకు వెళ్లి పింఛన్‌సొమ్ము అందిస్తూ గ్రామ వలంటీర్లు శభాష్ అనిపించుకుంటున్నారు. మండలంలోని మద్దూరు గ్రామానికి చెందిన రామిరెడ్డి అనే వృద్ధుడు అనారోగ్యంతో నంద్యాల జిల్లా కేంద్రంలోని శాంతిరాం వైద్యశాలలో చికిత్స పొందుతున్నాడు. గురువారం ఆ గ్రామ వలంటీర్లు హబీబ్, అజ్మతుల్లాలు, వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు జబ్బార్ మియ్యతో కలిసి నంద్యాల వెళ్లి పింఛన్ దారుడికి నగదును అందజేశారు. అలాగే కొత్తపల్లి మండలంలోని శివపురం గ్రామానికి చెందిన షేక్ చిన్న బాషుమియ్య అనే వృద్ధుడు కర్నూలు జనరల్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. గ్రామ వలంటీర్ షేక్ జాస్మిన్ కర్నూలు వెళ్లి పింఛన్ అందజేంది.

మిడుతూరు: మండలపరిధిలోని రోళ్లపాడు గ్రామానికి చెందిన కురువ రాముడు తీవ్ర అనారోగ్యంతో కర్నూలు విశ్వభారతి హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ వలంటీర్ ప్రకాశ్‌రెడ్డి గురువారం హాస్పిటల్‌కు చేరుకొని పింఛన్ అందజేశాడు

రాజంపేట వెళ్లి పింఛన్ అందజేత

మహానంది: బోయిలకుంట్ల మెట్ట గ్రామ సమీపంలో కాశిరెడ్డినాయన ఆశ్రమం నిర్వహిస్తున్న నిర్వాహకురాలు తియ్యగూర రత్నమ్మకు వికలాంగుల పింఛన్ వస్తుంది. అయితే ఇటీవల ఆమె అనారోగ్యంతో బాధపడుతూ వైఎస్సార్ జిల్లా రాజంపేటలో వారి బంధువుల దగ్గర ఉంటోంది. రత్నమ్మ ఊర్లో లేని విషయం తెలుసుకున్న వలంటీర్ అనిత నేరుగా రాజంపేట వెళ్లి పింఛన్ అందివ్వడంతో లబ్ధిదారురాలు రత్నమ్మ, కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.